సిగ్నల్స్ లేక.. రూల్స్ పాటించక..

- పర్వత్‌నగర్ చౌరస్తాలో తీవ్రంగా ట్రాఫిక్ సమస్య
- తరచూ ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్న స్థానికులు



పర్వత్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వన్ వే ఉండడంతో పాటు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల



ఖైత్లాపూర్ నుంచి పర్వత్‌నగర్ చౌరస్తా బ్యాంక్ కాలనీ వరకు బ్రిడ్జి ప్రారంభం కావడంతో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పర్వత్‌నగర్ చౌరస్తాలో యూ టర్న్ లేకపోవడంతో కిలో మీటర్ దూరంలో ఉన్న అయ్యప్ప సొసైటీ వద్ద యూటర్న్ తీసుకోవాల్సి రావడంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. కొంతమంది రాంగ్ రూట్‌లో వస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని విన్నవించినా ఫలితం లేదని స్థానికులు చెబుతున్నారు. కనీసం సాయంత్రం వేళల్లో అయినా పర్వత్‌నగర్ చౌరస్తాలో కాలనీ లోపలకు వచ్చే దారిలో తాత్కాలికంగా బారికేడ్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి



ఇటీవల బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగింది. గతంలో సిగ్నల్ వ్యవస్థ లేకపోయినా వాహన చోదకులు సరైన మార్గంలో వెళ్లేవారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ట్రాఫిక్ పోలీసులు ఉండే విధంగా చర్యలు తీసుకొని సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి.

–రూపారాం, పర్వత్‌నగర్

బారికేడ్లు ఏర్పాటు చేసుకుంటాం



ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగించడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, కొండాపూర్, లింగంపల్లికి మార్గమధ్యం కావడంతో పర్వత్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ట్రాఫిక్ పోలీసులు అనుమతిస్తే తామే బారికేడ్లు ఏర్పాటు చేసుకుంటాం.

– మహమ్మద్ జాహెద్ షరీఫ్ బాబా, పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

చిరుధాన్యాలపై అవగాహన



భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్ కాలనీలో రైతు నేస్తం ఫౌండేషన్ సహకారంతో కర్షక సేవా కేంద్రం ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, డా.ఖాదర్‌వలీ, పాకశాస్త్ర నిపుణుడు మిల్లెట్ రాంబాబు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిరుధాన్యాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరగాలన్నారు. మారిన జీవన శైలికి అనుగుణంగా చిరుధాన్యాలను ఎక్కువగా వినియోగించాలని సూచించారు. సజ్జలు, జొన్నలు, రాగులు, వరిగలు వంటి వాటితో పోల్చుకుంటే కొర్రలు, అరికలు, సామలు, ఊదలు, అండుకొర్రలలో ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు అధికంగా అందుతాయన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, సమతానగర్ కాలనీవాసులు బాలు, శివప్రసాద్, రామకోటేశ్వరరావు, వినయ్‌బాబు, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా కేపీహెచ్‌బీ 11కేవీ ఫీడర్ పరిధిలో సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్‌బీ పాత 9వ ఫేజ్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫీడర్ పరిధిలోని హెచ్ఎండబ్ల్యూఎస్ వాటర్ వర్క్స్, ఫోరం మాల్ వెనుక వైపు, హెచ్ఐజీ పార్కు, బీఆర్ఎస్ కార్యాలయం ప్రాంతాల్లో.. కొత్త 9వ ఫేజ్ ప్రాంతంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫీడర్ పరిధిలోని వీధి లైట్లు, ఆటో స్టాండ్, పొలిమేరాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గీతాంజలి స్కూల్ వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ గీతాంజలి స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమాన్ని రవీంద్రభారతిలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మదాపూర్ డీసీపీ శిల్పవల్లి, గీతాంజలి స్కూల్ చైర్మన్ శ్రీనివాస్‌రావు, గీతాంజలి స్కూల్ డైరెక్టర్ గాయత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించడంతో పాటు ఆట పాటల్లోనూ తర్ఫీదు ఇస్తూ వారి విజ్ఞానాన్ని మరింత పెంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్టు ఎంపిక



కబడ్డీ క్రీడాకారులతో శ్రీకాంత్, హరీష్‌రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ పోచమ్మ తల్లి గ్రౌండ్స్‌లో ఆదివారం ఆల్ ఇండియా టోర్నమెంట్ కోసం రాష్ట్ర కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ హరీష్‌రెడ్డి, కార్యదర్శి ఎ.ఊషీరెడ్డి, పలు జిల్లాల సెక్రటరీలు, క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం కబడ్డీ పోటీలు నిర్వహించారు.

బీజేపీలో పలువురి చేరిక

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల యువకులు బీజేపీలో చేరారు. కొండాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి మారబోయిన రఘునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీలో చేరారు. దేశంలో నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై యువత బీజేపీ వైపు మొగ్గు చూపుతుందన్నారు.

బీజేపీ బలోపేతానికి మహిళలు ముందుకు రావాలి



మియాపూర్: మియాపూర్‌లో రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, మహిళా మోర్చ ఇంచార్జి శ్రీధర్, నియోజకవర్గ కన్వీనర్ పద్మ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ మహిళా మోర్చా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేయడానికి మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అన్ని డివిజన్‌లలో మహిళా మోర్చ కమిటీలు , శక్తి కేంద్ర ఇంచార్జీలను నియమించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ నాయకులు నాగులుగౌడ్, మహబూబ్‌నగర్ మహిళా మోర్చా ఇంచార్జి వినయ, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ వరలక్ష్మీ ధీరజ్, విజయ, కల్పన, అరుణ, శోభా, మహేశ్వరీ, రేణుక, శ్రీలత, శిరీషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేయాలి

గచ్చిబౌలి: హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు. ఆదివారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోదండ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి, నాయకులు హాజరయ్యారు. ఈ నెల 26 నుంచి పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేసేందుకు కలిసి కట్టుగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు కోటిరెడ్డి వినయ్‌రెడ్డి, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి



కలెక్టర్ హరీష్‌రావును సన్మానిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ హరీష్‌రావును ఆయన కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇచ్చిన అభ్యర్థన మేరకు అల్లాపూర్‌లో సర్వే నెంబర్18లోని భూమిని జీహెచ్ఎంసీకి అందజేసినందకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో కొత్త అంగన్‌వాడీ సెంటర్‌లను ప్రారంభించాలని, నూతన లబ్ధిదారులకు వారి అకౌంట్‌లో పెన్షన్ నగదు జమ కాకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని, వారికి నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జాహెద్ షరీఫ్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

గోపాల్‌నగర్‌లో 5కే రన్



రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ గోపాల్‌నగర్‌లో ఆదివారం 5కే రన్ నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించే విధంగా ఇలాంటి కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులు అజయ్ సునీల్, కాలనీ వాసులను ఆయన అభినందించారు. నిత్యం ప్రతి ఒక్కరూ ఒక గంట వ్యాయామం చేస్తే వారికి ఎటువంటి అనారోగ్య సమస్యలు రావన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో క్రీడలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, గోపాల్‌నగర్‌లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని ఆయన అన్నారు. ఓపెన్ జిమ్‌లు, క్రీడా మైదానాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు సాయిబాబాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



బహుమతులు పొందిన విద్యార్థులు

ఆల్విన్‌కాలనీ: యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన 'చిగురు' కార్యక్రమంలో ఎల్లమ్మబండకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు డ్యాన్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. దీంతో పాటు సైన్స్ ఫెయిర్‌లో ద్వితీయ బహుమతి పొందారు. ప్రధానోపాధ్యాయులు కె.రాధాపద్మజ, యూత్ ఫర్ సేవా సమన్వయకర్త అరుణ్మయి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, రాములు, సరోజ, అర్చన విద్యార్థులు పాల్గొన్నారు.

'నాణ్యత లోపంతోనే ప్రమాదం'



స్లాబ్ కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ, డీసీ రవీందర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో ఇంటి స్లాబ్ కూలి ఇద్దరు కార్మికులు మృతిచెందిన ప్రాంతాన్ని ఆదివారం కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డీసీ రవీందర్ పరిశీలించారు. నిర్మాణంలో వినియోగించిన సిమెంట్‌లో నాణ్యత లేదని, వారు వేసిన కాంక్రీట్‌ను టెస్ట్ చేయాలని డీసీ రవీందర్‌ను కార్పొరేటర్ కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యత పాటించని రెడీమేడ్ కాంక్రీట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలనీలో మీట్ అండ్ గ్రీట్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ నిహారిక ల్యాండ్ మార్క్‌లో బీజేపీ నాయకులు రవికుమార్‌యాదవ్ ఆదివారం పర్యటించారు. మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో భాగంగా అపార్టుమెంట్ వాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

యాదవుల అభివృద్ధికి కృషి చేస్తాం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ జయానగర్‌లో ఆదివారం యాదవ, కురుమ సంఘాల సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివేకానందనగర్, కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌లకు చెందిన యాదవులు పాల్గొని కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా దాసరి నర్సింగ్‌యాదవ్‌ను ఎన్నుకోగా, అధ్యక్షుడిగా ఎక్కల్‌దేవ్ శ్రీకాంత్‌యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా కాశీనాథ్‌యాదవ్, కుమార్‌యాదవ్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో పదవులు ఇచ్చినందుకు సంఘం పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. యాదవుల హక్కుల కోసం, అభివృద్ధి కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీరప్ప యాదవ్, రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మల్లి యాదవ్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న యాదవ, కురుమ సంఘం నాయకులు

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ 9వ ఫేజులోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం వేల కోట్ల నిధులతో ఇప్పటికే కేపీహెచ్‌బీ డివిజన్‌ను అభివృద్ధి చేసిందన్నారు. అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని, బూత్‌స్థాయి కమిటీలను వెంటనే నియమించాలని సూచించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు సాయిబాబాచౌదరి, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి సహకారం అందిస్తా



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన అదనపు గదులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి రంగారావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన గదులను ప్రారంభించడం సంతోషకరమైన విషయమన్నారు. వీటిని గెస్ట్ రూములుగా వాడుకోవచ్చని, కాలనీ వాసులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కాలనీ అభివృద్ధికి సహకారం అందిస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, నాయినేని చంద్రకాంత్‌రావు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ముగ్గుల పోటీలు



రాజేశ్వరరావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ జన్మభూమి కాలనీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మైనార్టీల ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్ నార్నే శ్రీనివాస్‌రావు హాజరై మహిళలు వేసిన ముగ్గులను తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. సంక్రాంతి సంబరాల్లో ముస్లింలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. జన్మభూమి కాలనీలో సంక్రాంతి వాతావరణం కనిపిస్తుందన్నారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో అన్ని పండుగలను కులమతాలకు అతీతంగా సోదర భావంతో అందరూ కలిసిమెలిసి జరుపుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. కులమతాలకు అతీతంగా పండుగలు చేసుకుంటే ఐకమత్యం పెంపొందుతుందన్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించిన మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎం.ఏ.సమద్, ఎంఏ కరీం, షౌకత్ అలీ, ఖాజా, షేక్ గౌస్, బడే ఖాజా, ఎండీ గౌస్, ఫెరోజ్, ఎండీ.గౌసుద్దీన్‌లను వారు అభినందించారు.

సగర సంఘం ఆధ్వర్యంలో..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ జగద్గిరిగుట్ట సగర మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సగర మహిళల అభ్యున్నతి కోసం సహకారం అందిస్తామన్నారు. సాంప్రదాయాలకు విలువనిస్తూ మహిళలు ముగ్గులు వేయడం అభినందనీయమన్నారు.

తులసినగర్‌లో..

◆ తులసినగర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, నరేష్, ప్రశాంత్, శ్రీనివాస్, హేమంత్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌లో బీజేపీ నాయకులు నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఆదివారం బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు సత్కరించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గంధం రాజు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, మాజీ కార్పొరేటర్ కావ్యారెడ్డి పాల్గొన్నారు.



ముగ్గులను తిలకిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

జీహెచ్ఎంసీకి స్థలం కేటాయించడం హర్షణీయం



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లో ఉన్న రెండున్నర ఎకరాల భూమిని మంత్రి కేటీఆర్ జీహెచ్ఎంసీకి కేటాయించడంపై ఎమ్మెల్యే కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడేటట్లు చేయాలని మంత్రిని కోరగా కేవలం 24 గంటల్లో జీవో తీసుకొచ్చి జీహెచ్ఎంసీకి స్థలం కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇక్కడ క్రీడా మైదానం, వ్యాయామశాలతో పాటు పార్కు ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో మొదటి మహిళా పార్కును ఏర్పాటు చేశామని, ఇండోర్ స్టేడియాలు, స్విమ్మింగ్ పూల్స్, షటిల్ కోర్టులు నిర్మించినట్లు తెలిపారు. ఐడీఎల్ చెరువు వద్ద బతుకమ్మ, వినాయకుడు, దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. 18 నెలల్లో సుందరీకరణ పనులు పూర్తి చేస్తామని ఆయన అన్నారు. చెరువుల్లో డ్రైనేజీ నీరు కలవకుండా ప్రణాళికలు సిద్ధం చేశామని, ట్రాఫిక్ రద్దీని తగ్గించే విధంగా ఇప్పటికే వేల కోట్ల రూపాయలతో ఫ్లైఓవర్లు, అండర్ పాస్ బ్రిడ్జీలు నిర్మించామన్నారు. నూతనంగా నర్సాపూర్ చౌరస్తా నుంచి ఫతేనగర్ మీదుగా అండర్ పాస్ నిర్మాణం, కూకట్‌పల్లి మెట్రో ట్రాక్ పార్కు నుంచి మరో అండర్ పాస్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.